శాంతించిన పసిడి

రూ.1,200 తగ్గిన పదిగ్రాముల ధర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన బంగారం ధరలు ఎట్టకేలకు శాంతించాయి. రోజుకొక రికార్డు స్థాయికి చేరిన పుత్తడి సోమవారం రూ.89 వేల దిగువకు పడిపోయింది. అధిక ధరల కారణంగా కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో ధరలు దిగొచ్చాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.1,200 తగ్గి రూ.88,200కి దిగొచ్చింది. ధరలు తగ్గకముందు ఇది రూ.89,400గా ఉన్నది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర కూడా రూ.1,200 దిగి రూ.89 వేల నుంచి రూ.87,800గా నమోదైంది. బంగారంతో పాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి రూ.1,200 తగ్గి రూ.87,800గా నమోదైంది. అయినప్పటికీ ఫ్యూచర్ మార్కెట్లో ఏప్రిల్ నెల డెలివరీకిగాను తులం ధర రూ.431 అధికమై రూ.85,118కి చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,911.95 డాలర్లు పలుకగా, వెండి 32.89 డాలర్ల వద్ద ఉన్నది.

కోలుకోని ఎగుమతులు

వరుసగా మూడో నెల క్షీణత • జనవరిలో 36.43 బిలియన్ డాలర్లే

నిరుడుతో పోల్చితే 2.38 శాతం పతనం • 22.99 బిలియన్ డాలర్లకు వాణిజ్య లోటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: దేశీయ ఎగుమతులు వరుసగా మూడో నెలా పడిపోయాయి. గత నెల 36.43 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. నిరుడుతో పోల్చితే ఈ జనవరిలో 2.38 శాతం తగ్గినట్టు సోమవారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు చెప్తున్నాయి. మరోవైపు దిగుమతులు భారీగా పెరిగాయి. ఆయా దేశాల నుంచి భారత్‌కు గత నెలలో 59.42 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులు జరిగినట్టు తేలింది. ఏడాది క్రితంతో చూస్తే 10.28 శాతం ఎగబాకడం గమనార్హం. దీంతో వాణిజ్య లోటు కూడా 22.99 బిలియన్ డాలర్లకు చేరింది. గత ఏడాది జనవరిలో 16.55 బిలియన్ డాలర్లుగా ఉన్నది. కాగా, పెట్రోలియం ధరల్లో ఒడుదొడుకులు, అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులే భారతీయ ఎగుమతుల క్షీణతకు కారణమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, ముడి చమురు దిగుమతులు గత నెల 13.43 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. నిరుడు జనవరిలో 16.56 బిలియన్ డాలర్ల క్రూడాయిల్ దిగుమతులు జరిగాయి. గత ఏడాది డిసెంబర్‌లో 15.27 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

పెరిగిన బంగారం దిగుమతులు

గత నెలలో దేశంలోకి పసిడి దిగుమతులు 40.79 శాతం పెరిగాయి. గత ఏడాది జనవరిలో 1.9 బిలియన్ డాలర్ల విలువైన పుత్తడి దిగుమతులు జరుగగా.. ఈ ఏడాది మాత్రం 2.68 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. దేశీయంగా పెరిగిన డిమాండే కారణమని వాణిజ్య మంత్రిత్వ శాఖ చెప్తున్నది. అయితే అంతకుముందు నెల డిసెంబర్‌లో 4.7 బిలియన్ డాలర్ల బంగారం దిగుమతులు దేశంలోకి వచ్చినట్టు తేలింది. ఇక ఈ దిగుమతుల్లో 40 శాతం స్విట్జర్లాండ్ నుంచే వస్తున్నది. ఆ తర్వాత యూఏఈ (16 శాతం), దక్షిణాఫ్రికా (దాదాపు 10 శాతం) దేశాలున్నాయి. ఇక వెండి దిగుమతులు జనవరిలో 82.84 శాతం ఎగిసి 883.18 మిలియన్ డాలర్లకు చేరాయి. కాగా, దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు రికార్డు స్థాయిలో నమోదవుతున్న విషయం తెలిసిందే.

ఏప్రిల్-జనవరిలో..

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో గడిచిన 10 నెలల్లో (ఏప్రిల్-జనవరి) దేశీయ ఎగుమతులు 358.91 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇదే సమయంలో 601.90 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులు జరిగాయి. ఎగుమతులు 1.39 శాతం పెరిగితే.. దిగుమతులు 7.43 శాతం పెరిగినట్టు తాజా గణాంకాల ద్వారా తెలుస్తున్నది. ఇక వాణిజ్య లోటు 242.99 బిలియన్ డాలర్లుగా ఉన్నది. పసిడి దిగుమతులు 32 శాతం ఎగిసి 37.85 బిలియన్ డాలర్ల నుంచి 50 బిలియన్ డాలర్లకు పెరిగాయి. అయితే గత ఆర్థిక సంవత్సరం మొత్తంగా దేశీయ పుత్తడి దిగుమతులు 45.54 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. ఈ క్రమంలో ఈసారి 60 బిలియన్ డాలర్లకు చేరవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. దేశీయ దిగుమతుల్లో బంగారం వాటానే 5 శాతానికి పైగా ఉంటున్నది. చైనా తర్వాత గోల్డ్ దిగుమతులు ఎక్కువగా జరుగుతున్నది భారత్‌లోకే. నగల వ్యాపారుల నుంచి విపరీతమైన డిమాండే కారణం. తగ్గిన కస్టమ్స్ సుంకాలు, సురక్షిత పెట్టుబడి సాధనంగా ఉండటం కూడా కారణాలే అంటున్నారు. గత వారం ఆల్‌టైమ్ హైని తాకుతూ తులం రూ.89,400 పలికిన సంగతి విదితమే.

'సంఘర్షణలు, పరస్పర సుంకాలతో అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చిత వాతావరణం నెలకొన్నప్పటికీ వస్తు, సేవల రంగాల్లో భారతీయ ఎగుమతులు బాగానే జరిగాయి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, బియ్యం, రత్నాలు, ఆభరణాల ఎగుమతులు ఆశాజనకమైన వృద్ధినే కనబర్చాయి. గత ఆర్థిక సంవత్సరం దేశీయ ఎగుమతులు 778 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరం 800 బిలియన్ డాలర్లను మించిపోవచ్చు. గతంతో పోల్చితే ఈ జనవరిలో రత్నాలు, ఆభరణాల ఎగుమతులు 15.95 శాతం ఎగిసి సుమారు 3 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.'

-సునీల్ భరత్‌వాల్, వాణిజ్య కార్యదర్శి

'కమోడిటీ, మెటల్ ధరల్లో ఒడుదొడుకులు జనవరిలో దేశీయ ఎగుమతుల క్షీణతకు కారణమయ్యాయి. డాలర్‌తో పోల్చితే స్థిరత్వం లోపించిన రూపాయి మారకం విలువ, సుంకాల సమరం వంటివి కూడా ఇబ్బందికరంగా మారాయి.'

-అశ్వినీ కుమార్, ఎఫ్ఐఈవో అధ్యక్షుడు

సూచీల వరుస నష్టాలకు బ్రేక్

సెన్సెక్స్ 58, నిఫ్టీ 30 పాయింట్ల లాభం

ముంబై, ఫిబ్రవరి 17: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా ఎనిమిది రోజులుగా నష్టపోతున్న సూచీలు ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చాయి. ప్రారంభంలో 600 పాయింట్లకు పైగా నష్టపోయిన దేశీయ ప్రామాణిక సూచీ సెన్సెక్స్‌కు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు బ్లూచిప్ సంస్థల షేర్లు కదంతొక్కడంతో చివరికి లాభాల్లోకి రాగలిగింది. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 57.65 పాయింట్లు అందుకొని 75,996.85 పాయింట్లకు చేరుకోగా, మరో సూచీ నిఫ్టీ 30.25 పాయింట్లు అందుకొని 22,959.50 వద్ద నిలిచింది. వాణిజ్య ఒప్పందంలో భాగంగా మెటల్, ఫార్మాలపై విధిస్తున్న టారిఫ్‌ల తగ్గింపుపై అమెరికా, భారత్ దేశాల ప్రతినిధులు త్వరలో భేటీ కానుండటం మార్కెట్లకు కలిసొచ్చిందని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. బ్లూచిప్ సంస్థలైన బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్‌గ్రిడ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జొమాటో, టాటా మోటర్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీలు అత్యధికంగా నష్టపోయాయి. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు లక్ష కోట్ల రూపాయల స్థాయిలో నిధులను తరలించుకుపోయారు. రంగాలవారీగా చూస్తే హెల్త్‌కేర్ 1.14 శాతం, ఎనర్జీ, సర్వీసెస్, మెటల్, పవర్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లు లాభాల్లో కదలాడగా..ఇండస్ట్రియల్స్, ఐటీ, టెలికం, ఆటో, టెక్ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.

రూ.250తో సిప్

ప్రారంభించిన ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్

ముంబై, ఫిబ్రవరి 17: చిన్న స్థాయి పెట్టుబడిదారులను ఆకట్టుకోవాలనే ఉద్దేశంలో ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్..మరో సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కేవలం రూ.250తో ఈ జన్‌నివేశ్ సిప్ స్కీంను సెబీ చైర్‌పర్సన్ మాధవి పూరి బచ్ సోమవారం ప్రారంభించారు. తొలిసారి మదుపు చేసేవారు, చిన్న మదుపర్లు, సెబీ అర్బన్‌లో ఉండే వారి లక్ష్యంగా ఈ సిప్‌ను ప్రారంభించినట్లు కంపెనీ ఎండీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ నంద కిశోర్ ఈ సందర్భంగా తెలిపారు. సాధారణంగా రూ.500తో సిప్ చేసే వెసులుబాటు ఉండగా, దీనిని మరింత మందికి చేరువ చేసేలా దీనిని సగానికి సగం తగ్గించి రూ.250కే సిప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. రోజు, వారం, నెలవారీ మొత్తంలో ఈ సిప్ కింద మదుపు చేయవచ్చును.

ఐఎస్‌బీకి 27వ ర్యాంకు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ) దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచింది. సోమవారం విడుదలైన ఫైనాన్షియల్ టైమ్స్ (ఎఫ్‌టీ) గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్ -2025లో దేశంలోనే టాప్-1 స్థానాన్ని నిలబెట్టుకుంది. ఇక అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానానికి ఎగబాకింది. అంతక్రితం ఏడాది 31వ స్థానంలో నిలిచి ఉన్నది.

మార్కెట్లోకి ఆడీ ఆర్ఎస్ క్యూ8

ప్రారంభ ధర రూ.2.49 కోట్లు

ముంబై, ఫిబ్రవరి 17: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ..ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆర్ఎస్ క్యూ8 పేరుతో విడుదల చేసిన ఈ కారు ప్రారంభ ధర రూ.2.49 కోట్లు. 4 లీటర్ల వీ8 టీఎఫ్ఎస్ఐ ఇంజిన్‌తో రూపొందించిన ఈ కారు కేవలం 3.6 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. టాప్‌స్పీడ్ 305 కిలోమీటర్లు. హెచ్‌డీ మ్యాట్రిక్స్ ఎల్‌ఈడీ హెడ్‌లైట్, భద్రత ప్రమాణాలు మెరుగుపరచడంలో భాగంగా ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు ఏర్పాటు చేసింది.

మాజిల్లానిక్‌లో 3,500 ఉద్యోగాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 17: హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ సంస్థ మాజిల్లానిక్ క్లౌడ్ లిమిటెడ్..వ్యాపారాన్ని శరవేగంగా విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఒకవైపు గణనీయమైన ఉద్యోగావకాశాలు కల్పిస్తూనే మరోవైపు కృత్రిమమేధస్సు ఆధారిత సేవలను విస్తరించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కంపెనీ ఎండీ, గ్లోబల్ సీఈవో జోసెఫ్ సుధీర్ తెలిపారు. తెలంగాణలో పురోగామి విధానాలు, ప్రతిభావంతుల లభ్యత కారణంగా మా కార్యకలాపాలకు విస్తరణకు ఇది అనువైన ప్రాంతంగా ఉన్నదని భావించి ఇక్కడ విస్తరణకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. వచ్చే రెండేండ్లకాలంలో రూ.600 కోట్ల టర్నోవర్‌తోపాటు ఉద్యోగుల సంఖ్యను 5 వేలకు పెంచుకోబోనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం సంస్థలో 1,600 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.564 కోట్ల ఆదాయాన్ని గడించింది.

యాపిల్ కన్నా.. రిలయన్సే మిన్న

అత్యుత్తమ బ్రాండ్లలో ప్రపంచంలోనే రెండో స్థానం

ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్‌లో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయ సంస్థ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: యాపిల్, నైక్ తదితర గ్లోబల్ దిగ్గజ బ్రాండ్లను వెనక్కునెట్టి భారతీయ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అత్యుత్తమ బ్రాండ్ల జాబితాలో దూసుకుపోయింది. తాజాగా విడుదలైన ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్ 2024 లిస్టులో సామ్‌సంగ్ తర్వాత బెస్ట్ బ్రాండ్‌గా ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాతే యాపిల్, నైక్, వాల్ట్ డిస్నీ, నెట్‌ఫ్లిక్స్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, టొయోటా వంటి ప్రముఖ సంస్థలుండటం గమనార్హం. కాగా, 2023తో పోల్చితే 2024లో సామ్‌సంగ్ 5వ స్థానం నుంచి నెంబర్ 1కు చేరింది. ఇక రిలయన్స్ 13 నుంచి 2కు వచ్చింది. అయితే యాపిల్ 1 నుంచి 3కు దిగజారింది. 2014లో అగ్రస్థానంలో ఉన్న గూగుల్.. 2024లో 57కు పడిపోయింది. మెటా కూడా 11 నుంచి 52కు దిగొచ్చింది. బోయింగ్, ఫోక్స్‌వాగన్ సంస్థలకైతే తాజా ర్యాంకింగ్స్‌లో చోటే లేకుండా పోయింది. ఇదిలావుంటే ఈసారి జాబితాలో రిలయన్స్ మినహా మరే ఇతర భారతీయ సంస్థలు లేవు. 'గడిచిన దశాబ్దానికిపైగా ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్.. విజయవంతమైన బ్రాండ్లు మనుగడ సాగించడంపైనే గాక, నిలకడైన వృద్ధిని ఎలా నిలబెట్టుకుంటున్నాయో తెలియపరుస్తున్నది' అని నిర్వహకులు ఈ సందర్భంగా అన్నారు. కాగా, ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్.. ఓ వార్షిక అధ్యయనం. మార్కెట్ క్యాపిటలైజేషన్, మరికొన్ని అంశాల ద్వారా టాప్-100 కంపెనీలతో ఓ జాబితాను సిద్ధం చేస్తుంది.

విమానాశ్రయంలో రన్‌వే అప్‌గ్రేడ్ పూర్తి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 17: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆధునిక నావిగేషన్ సిస్టం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జీఎమ్మార్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి మాట్లాడుతూ.. నూతన రన్‌వే అందుబాటులోకి రావడంతో విమానాల రాకపోకలు మెరుగుపడటంతోపాటు భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయని వివరించారు. అధునాతన వ్యవస్థ 300 మీటర్ల(ఆర్‌వీఆర్) దృశ్యమానం ఉన్న ప్రతికూల వాతావరణంలో విమానాలు సురక్షితంగా ల్యాండింగ్ అయ్యే వీలు పడనున్నది.



కేటీఆర్‌ను కలసిన మాజీ ఓడీఎంఎస్ చైర్మన్

మరిపెడ, ఫిబ్రవరి 17: మార్చి 6న హైదరాబాద్‌లో జరిగే తమ కుమారుడు నరేశ్ రెడ్డి వివాహానికి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్సీ కవితను సోమవారం ఓడీఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి, కరుణ దంపతులు ఆహ్వానించారు. వారికి శుభలేఖలు అందజేశారు.

కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్న ఓడీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి దంపతులు

సబ్ స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

కొత్తగూడ, ఫిబ్రవరి 17 : కొత్తగూడ మండలంలోని సాధిరెడ్డిపల్లి సబ్ స్టేషన్‌లో విద్యుత్ నిలిపివేయడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని కోనాపురం గ్రామానికి చెందిన రైతులు సోమవారం సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. వేల రూపాయల పెట్టుబడి పెట్టి పంటలను పండిస్తుంటే సకాలంలో విద్యుత్ అందకపోవడంతో ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్‌కు వెళ్లి ఆపరేటర్‌ను నిలదీయగా, సబ్ స్టేషన్‌కు కావాల్సినంత విద్యుత్ రావడం లేదని, అందువల్లే విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అన్ని బోర్లు ఒకే సారి వేయడంతో సబ్‌స్టేషన్‌లో ఫీజులు కొట్టేస్తున్నాయని సమాధానం చెబుతున్నారని అన్నారు. దీంతో ఆగ్రహించిన రైతులు ఆందోళన చేపట్టారు.

దొంగతనం కేసులో ఒకరికి ఏడాది జైలు

చిన్నగూడూరు : దొంగతనం కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష విధించిన ఘటన తొర్రూరు కోర్టులో సోమవారం జరిగింది. ఎస్సై జాన్సీ కథనం ప్రకారం.. ఉగ్గంపల్లి గ్రామం దేవోజితండాకు చెందిన భూపాల్ ఇంట్లో 2023లో దొంగతనం జరిగింది. నల్లగొండ జిల్లా గుర్రంపోడ్ మండలం తేనెపల్లి గ్రామానికి చెందిన శివర్ల కోటేశ్‌పై అప్పట్లో కేసు నమోదైంది. కాగా, తొర్రూరు జడ్జి సరిత సోమవారం నిందితుడికి రూ.వెయ్యి జరిమానా, ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

దంతాలపల్లి : చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన మిడతపల్లి ప్రశాంత్ (28) కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ నెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు తొర్రూరు లోని వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత

డోర్నకల్ : అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని డోర్నకల్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సీఐ రాజేశ్ కథనం ప్రకారం.. ఉయ్యాలవాడ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎస్సై ఉమ సిబ్బందితో వాహన తనిఖీలు చేస్తున్నది. ఈ క్రమంలో అటు వైపుగా వెళ్తున్న రెండు బైక్‌లను ఆని తనిఖీ చేయగా సుమారు 19.68కిలోల ఎండు గంజాయి దొరికింది. ఒడిశాకు సమర భూమియా, సీసీఎల్, మహదేవ్ మండల, ఉమేశ్ మండలను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి విలువ రూ. 4.92లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుల్ సైదులు, రవి పాల్గొన్నారు.



గంజాయి నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

తొర్రూరు కాంగ్రెస్‌లో వర్గపోరు

- బీఆర్ఎస్ వైపు బడా నేతల మొగ్గు
- ఇప్పటికే ఎర్రబెల్లితో రెండు సార్లు రహస్య భేటీ
- ముఖ్య నేతలను ఎమ్మెల్యే పక్కన పెట్టడమే కారణమా?



తొర్రూరు, ఫిబ్రవరి 17 : తొర్రూరు కాంగ్రెస్‌లో వర్గపోరు తారస్థాయికి చేరింది. పార్టీలో అంతర్గత విభేదాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే వైఖరితో తీవ్ర అసంతృప్తితో కొందరు బడా నేతలు బీఆర్ఎస్‌లో చేరేందుకు మొగ్గుచూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పరిణామాలు పార్టీ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారనున్నాయి. స్థానిక ఎమ్మెల్యే గెలుపు కోసం ఎనలేని కృషి చేసిన నాయకులు, ఇప్పుడు పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారు. బడా నేతలను పక్కన పెట్టడమే సదరు ఎమ్మెల్యే చేసిన పొరపాటని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. ఫలితంగా పార్టీ బలహీనపడి స్థానికంగా ఉన్న ఆదరణ తగ్గిపోతుందన్న భావన కార్యకర్తలు, శ్రేణుల్లో పెరుగుతోంది.

కీలక నేతలతో రహస్య భేటీ?

అసంతృప్త నేతలు ఇప్పటికే బీఆర్ఎస్ కీలక నేతలతో రెండు సార్లు భేటీ అయ్యాని సమాచారం. ఈ సమావేశాలు రాజకీయంగా ఉత్కంఠ రేపుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం కూడా ఈ మార్పులను ఆసక్తిగా గమనిస్తోందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్‌లోని అసంతృప్త నాయకులను చక్కదిద్దే ప్రయత్నం చేయకుండా వారిని దూరం చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని కొందరు విశ్లేషకులు అంటున్నారు.

కాంగ్రెస్‌లో కిడ్నాప్ ఘటన కలకలం

కాంగ్రెస్‌లో వర్గపోరుకు పరాకాష్టగా ఓ భూవివాదం విషయంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి, పార్టీకి చెందిన బడా నేత అండదండలతో కాంగ్రెస్ కార్యకర్తను కారులో తీసుకెళ్లి కిడ్నాప్ చేసిన ఘటన సంచలనం రేపింది. ఈ ఘటన కాంగ్రెస్‌లో విభేదాలు ఎక్కడివరకు వెళ్లాయో చెబుతోంది. పార్టీ నాయకత్వం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే. ఈ ఘటన పార్టీలో విభేదాలను మరింత ముదిరాయని, ఇప్పటికే అసంతృప్తితో ఉన్న నేతలకు మరో కారణంగా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తల్లో దీనిపై తీవ్ర ఆగ్రహం నెలకొంది.

స్థానిక సంస్థ ఎన్నికలపై ప్రభావం?

ఈ పరిణామాల నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగలనుందని పార్టీ వర్గీయులే చెబుతున్నారు. ఇప్పటికీ వర్గపోరు వల్ల అనేక మంది అసంతృప్తితో ఉన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే తొర్రూరు కాంగ్రెస్‌కు రాజకీయంగా కష్టకాలమేనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీఆర్ఎస్ ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నేతల మధ్య విభేదాలతో కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా మారుతుందని భావిస్తున్నారు.

ట్యాబ్ లేకపోవడంతో కొత్తగూడలో నిలిపివేసిన 108 వాహనం

ట్యాబ్ మాయం.. నిలిచిన 108 సేవలు

కొత్తగూడ, ఫిబ్రవరి 17 : ట్యాబ్ మాయం కావడంతో 108 సేవలు నిలిచిపోయిన ఘటన కొత్తగూడ మండలంలోని సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడ మండలంలోని పలు గ్రామాల నుంచి రోగులను ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, నర్సంపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించేందుకు ప్రభుత్వం జీవీకే ఆధ్వర్యంలో 108ను మంజూరు చేసింది. సోమవారం ఉదయం 6.10 గంటల సమయంలో సిబ్బంది కొత్తగూడ సమీపంలోకి వెళ్లివచ్చి చూసే సరికి వాహనంలో ట్యాబ్ కనిపించలేదు. దీంతో ఫోన్ కాల్స్ రాక సేవలు నిలిచిపోయాయి. వెంటనే 108 సిబ్బంది రాంబాబు కొత్తగూడ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

రిమాండ్‌కు ఇద్దరి తరలింపు..

తొర్రూరు : తొర్రూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కంతాయపాలెం గ్రామానికి చెందిన అమడగాని సురేశ్ (24), మాటేడు గ్రామానికి చెందిన శివరాత్రి వెంకటేశ్ (24)పై కేసులు నమోదు కాగా, తదుపరి విచారణ నిమిత్తం నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు సోమవారం మహబూబాబాద్ జిల్లా సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

రేవంత్ చెప్పింది నిజమే..

- ప్రధాని బీసీ కాదు.. ఓసీ..
- ఎంపీ పోరిక బలరాంనాయక్

మాట్లాడుతున్న బలరాంనాయక్

కురవి, ఫిబ్రవరి 17 : కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ మాటకు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి బీసీల గణన చేపట్టాడని, ఆ నిర్ణయమే చరిత్రలో నిలిచిపోతుందని మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాంనాయక్ అన్నారు. మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బీసీ కాదని, ఓసీ నేనని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న కుటుంబం నెహ్రూ కుటుంబమని, స్వాతంత్ర్య ఉద్యమంలో బండి సంజయ్ ఉన్నాడా అని ప్రశ్నించారు. నెహ్రూ కుటుంబం గురించి మాట్లాడే స్థాయి బండి సంజయ్‌కు ఉందా అన్నారు. నెహ్రూ కుటుంబంలో దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణాలను అర్పించారని, బండి సంజయ్ ఇంట్లో కానీ, ప్రధాని మోదీ ఇంట్లో గానీ ఎవరైనా ప్రాణ త్యాగాలు చేశారా.. నాకైతే తెలియదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మరిపెడ, ఫిబ్రవరి 17 : సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. సోమవారం ఆయన మరిపెడ సర్కిల్ కార్యాలయంతోపాటు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వివిధ సమస్యలతో వచ్చే బాధితులకు న్యాయం చేసేలా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐలు సతీశ్, సంతోష్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

పెద్ద చెరువు సందర్శన

బయ్యారం, ఫిబ్రవరి 17 : బయ్యారం పెద్ద చెరువును పర్యాటక శాఖ ఉమ్మడి జిల్లా అధికారి శివాజీ, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి రాజేంద్రప్రసాద్ సోమవారం పరిశీలించారు. చెరువు కట్టపై ఉన్న 11వ శతాబ్దం నాటి కాకతీయ శాసనాన్ని సందర్శించి, చరిత్రను పరిశీలించారు. కట్టపై ఉన్న కట్ట మైసమ్మ, మత్తడి, చెరువు లోతును తెలిపే తూము, చెరువు మధ్యలో ఉన్న ఐ లాండ్‌ను పరిశీలించి, పర్యాటకంగా అభివృద్ధికి అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఎకో టూరిజం అభివృద్ధికి అనువైన స్థలంగా గుర్తించి రిసార్టులు, అతిథి గృహాలు ఏర్పాటు చేస్తామని తద్వారా జిల్లా పర్యాటక రంగం అభివృద్ధి చెందతుందన్నారు.

కాకతీయుల శాసనాన్ని పరిశీలిస్తున్న పర్యాటకశాఖ అధికారి శివాజీ

నా భూమి పెద్ద కొడుకు లాక్కున్నాడు

- అక్రమంగా పట్టా చేయించుకున్నాడు
- న్యాయం చేయాలని అతడి ఇంటి ఎదుట తల్లి తాటికొండ కమలమ్మ దీక్ష



గొల్లచర్ల క్రాస్ రోడ్డులో పెద్ద కుమారుడు మల్లారెడ్డి ఇంటి వద్ద నిరాహార దీక్ష చేస్తున్న తల్లి కమలమ్మ

డోర్నకల్, ఫిబ్రవరి 17: 'నా భూమిని పెద్ద కొడుకు అక్రమంగా పట్టా చేయించుకున్నాడు. న్యాయం చేయాలి' అని అతడి ఇంటి ఎదుట వృద్ధురాలు దీక్ష చేపట్టింది. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామానికి చెందిన తాటికొండ కమలమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ముగ్గురు కొడుకులకు సమానంగా భూమి పంచి ఇచ్చింది. 2.20 ఎకరాలు తన పేరిట ఉంచుకుంది. పెద్ద కుమారుడు మల్లారెడ్డిని బాగా చదివించింది. అతడికి రైల్వేలో ఉద్యోగం వచ్చింది. తల్లి కమలమ్మకు ఉన్న రెండు ఎకరాల 20 గుంటల భూమిని మల్లారెడ్డి తన స్నేహితుడైన రెవెన్యూ అధికారి సహకారంతో పట్టా చేయించుకున్నాడు. తనను మోసం చేసి భూమి పట్టా చేయించుకున్నాడని కమలమ్మ వాపోయింది. తన భూమి తనకు ఇవ్వాలని మల్లారెడ్డి ఇంటి ఎదుట సోమవారం దీక్షకు కూర్చున్నది. తనకు న్యాయం జరిగే వరకు దీక్షను విరమించనని స్పష్టం చేసింది.

మహిళా సంఘాల డబ్బులు గోల్‌మాల్

హనుమకొండ/ధర్మసాగర్, ఫిబ్రవరి 17 : ధర్మసాగర్‌లోని సిరి గ్రామైక్య సంఘంలో డబ్బులు గోల్‌మాల్ జరిగాయని సోమవారం సంఘంలోని మహిళలు కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిరి గ్రామైక్య సంఘంలో 250 మంది సభ్యులు స్త్రీనిధి రుణాలు తీసుకున్నారని, ప్రతి నెల 19వ తేదీన సంఘం వీవోఏ పుట్ట పద్మకు కిస్తీ చెల్లిస్తున్నామని, కానీ ఆ డబ్బులు ఖాతాలో జమ చేయకుండా కాజేసిందని తెలిపారు. దీంతో మా వీవో ఎన్‌పీఏ(బకాయి) రావడంతో సభ్యుల నిర్ణయం మేరకు ఆడిట్ చేయించగా మొత్తం సుమారు రూ. 17లక్షలు పద్మ వ్యక్తిగతంగా వాడుకున్నట్లు తేలిందన్నారు. ఈ విషయాన్ని వీవోఏ కూడా ఒప్పుకున్నదని, ఈ డబ్బులు మూడు దఫాలుగా చెల్లిస్తానని సభ్యుల సమక్షంలో రాసిచ్చిందన్నారు. చెల్లిస్తానని ఒప్పుకొని సభ్యులకు లీగల్ నోటీసులు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వీవోఏ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, రూ. 17లక్షలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మమత, స్వప్న, వరలక్ష్మి, సుజాత, శ్యామల, సుమలత, పావని ఉన్నారు.